**జరిగిన కథ :** స్త్రీరాజ్యపు మహారాణిని కన్యాకుబ్జ యువరాజు పుష్పకేతుడు వివాహం చేసుకున్నాడు. కొలువులో తమ ముందుకు వచ్చిన రెండు హత్యాపరాధాలపై విచారణలో.. తప్పిపోయిన తన సోదరులను కలుసుకున్నాడు. ఈ సందర్భంగా వాళ్లు తమతమ కథలను చెప్పుకొన్నారు. చివరిగా మయూరధ్వజుని వంతు వచ్చింది.






# మయూరధ్వజుని పెళ్లి

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

మయూరధ్వజుడు స్త్రీరాజ్యపు దక్షిణపు పొలిమేరలో తాను విన్న కథను సోదరులకు వినిపిస్తున్నాడు.

ఉజ్జయినీ రాజ్యానికి రాజైన గోపాలుడు తన తండ్రిని చంపి రాజ్యానికి వచ్చాడనే అపవాదుతో కుమిలిపోయాడు. అసలు ఆ అపవాదు ఎందుకు, ఎలా పుట్టిందో తెలుసుకోవాలనే ఉద్దేశంతో.. ఆ మరునాటి రాత్రి మారువేషంతో రాజ్యంలో సంచరించసాగాడు.

ఒకచోట ఒక కాముకుడు తన అభిసారికను రహస్యంగా కలుసుకుని, మాట్లాడుతుండగా.. గోపాలుడు వారి మాటలు పొంచి విన్నాడు.

మాటల మధ్యలో ఆ అభిసారిక..

''మన సంబంధానికి నా భర్త, పిల్లలు అడ్డంగా ఉన్నారు'' అని చెప్పింది.

అందుకు ఆ కాముకుడు..

''వాళ్లను చంపేసి నా దగ్గరికి వచ్చేయి. మన గోపాలుడు తండ్రిని చంపి రాజ్యానికి రాగా లేనిది.. నువ్వు నీ భర్తను, పిల్లలను అడ్డం తొలగించుకుంటే తప్పేముంది?'' అన్నాడు.

ఆ మాటలు విని, గోపాలుడు మరింత బాధపడ్డాడు. మరికొంత ముందుకు వెళ్లేసరికి.. పాలు తాగకుండా గుక్కపట్టి ఏడుస్తున్న బిడ్డను ఒక తల్లి.. ''పితృఘాతకుడా!'' అని తిట్టింది.

దానికి ఆ పిల్లవాడి తండ్రి..

''ఎందుకంత మాటన్నావ్?!'' అని అడిగితే..

''వయసు పెరిగేకొద్దీ బిడ్డలు తల్లిదండ్రుల చావునే అతిగా ఊహించుకుంటూ, కోరుకుంటూ ఉంటారు. మన గోపాలుడు కూడా తండ్రిని చంపే రాజ్యానికి వచ్చాడు కదా!'' అన్నదామె.

ఆ మాటలు కూడా గోపాలుడి చెవిలో పడ్డాయి. మరికొంత ముందుకు వెళ్లేసరికి.. ఒక తండ్రి, కొడుకు గొడవపడుతున్నారు.

''నువ్వు బతికుండగా ఈ ఆస్తి నన్ను అనుభవించనివ్వవు. గోపాలునిలా నిన్ను చంపి, ఈ ఆస్తి నేను లాక్కుంటాను'' అంటున్నాడు కొడుకు.

అడుగడుగునా గోపాలునికి ఇటువంటి మాటలే వినిపించాయి. అతని హృదయం మరింతగా రగిలిపోయింది. బాధాతో అంతఃపురానికి చేరుకున్నాడు. తెల్లవారుతూనే మంత్రులిద్దరినీ రప్పించాడు.

''నేను పితృహంతకుడిననే అపవాదు రాజ్యమంతా వ్యాపించింది. కానీ, నేను తండ్రిని దైవంలా ఆరాధించినవాణ్ని. అలాంటి నేను నా తండ్రిని చంపడమేమిటి?! పైగా ఆ విషయం నాకు తెలియకపోగా.. రాజ్యంలో ప్రతి ఒక్కరికీ తెలియడం ఏమిటి?! దీనికి కారణమేమిటో అంతుపట్టడం లేదు. నిప్పు లేకుండా పొగరాదు. దీనిపై సరైన విచారణ జరిపి, నిజానిజాలు తేల్చండి'' అన్నాడు గోపాలుడు.

అప్పుడు మంత్రులు..

''మహారాజా! మీకొక సంగతి మనవి చేయాల్సి ఉంది. మీ తండ్రిగారి చివరిరోజుల్లో మీరు విజయయాత్రల్లో ఉన్నారు. ఆయన దగ్గర లేరు. మృత్యువు సమీపిస్తున్న కొద్దీ మీ తండ్రిలో క్రూరత్వం ఆవహించింది. చిన్నచిన్న అపరాధాలకే తన భృత్యులకు మరణదండన విధించేవాడు. ఒకరోజు మంగలి తెల్లవెంట్రుకకు బదులుగా నల్లవెంట్రుకను పెరికాడని చంపించాడు. భోజనంలో పంటికింద రాయి వచ్చిందని వంటవాణ్ని చంపించాడు. వింజామర గట్టిగా వీచిందని పరిచారికను చెరసాలలో పెట్టించాడు. వందిమాగధులు నిద్రాభంగం చేశారని కొరడాదెబ్బలు కొట్టించాడు. ఇలా మీ తండ్రి విచిత్రరీతిలో ప్రవర్తిస్తుంటే విసిగిపోయిన రాజ్యపౌరులందరూ ఆయన మరణాన్నే కోరుకునేవారు. అటువంటి సమయంలో మా తండ్రిగారు మరణించారు. మేం మంత్రిపదవిలోకి వచ్చాం. పరిస్థితులన్నీ సమీక్షించిన తరువాత, మీ తండ్రిగారిని చెరసాలలో పెట్టించాం. విజయయాత్ర ముగించుకుని, వెంటనే రాజ్యానికి రావాల్సిందని మీకు వార్త పంపాం. మీరు తిరిగి వచ్చేలోపుగా దైవికంగా మీ తండ్రిగారు చెరసాలలోనే మరణించారు'' అని చెప్పారు.

ఆ మాటలు వింటూనే గోపాలుడు తలవంచుకుని, కొంచెంసేపు ఊరుకున్నాడు. కళ్లనీరు నిండుతుండగా ఆకాశం వంక చూస్తూ..